సాగునీరు దిగువకు పారేలా చర్యలు

వెంకటాపురం, న్యూస్‌టుడే: పాలెంవాగు మధ్యతరహా జలాశయం సాగునీరు ఆయకట్టు భూములకు చేరేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 16వ తేదీన 'ఈనాడు'లో 'కాలువలు అధ్వానం... సాగు ప్రశ్నార్థకం..!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ప్రాజెక్టు అధికారులు స్పందించారు. తక్షణమే తాత్కాలిక మరమ్మతు పనులను చేపట్టారు. వెంకటాపురం-వాజేడు మండలాల సరిహద్దు ఆర్.గుంటపల్లి వద్ద రహదారిలో ప్రధాన కాలువకు అమర్చిన సిమెంట్ పైపుల్లో పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులు చేశారు. బర్లగూడెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న మిర్చి, వరి, మొక్కజొన్న క్షేత్రాలకు సాగునీరు సరఫరా అయ్యేలా పూడిక పనులు చేస్తున్నారు. సిమెంట్ గొట్టాల వద్ద శాశ్వత పనులు చేసేనే రైతులకు నీరు సమృద్ధిగా అందనుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎట్టకేలకు నీరు కాలువలో ప్రవహించడంతో కర్షకుల్లో హర్షం వ్యక్తమైంది.

ఈనాడు కథనానికి స్పందన



జేసీబీతో పూడికమట్టి తొలగింపు పనులు

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, న్యూస్‌టుడే: ప్రజలకు న్యాయ సలహాలు అందించేందుకు పారా లీగల్ వాలంటీర్లుగా పని చేయాలనుకునే ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్వీపీ సూర్యచంద్రకళ, కార్యదర్శి కన్నయ్యలాల్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గుర్తింపు కార్డు, రెండు స్టాంపు సైజ్ ఫొటోలు, సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 30వ తేదీ లోగా జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన నిరుద్యోగ యువత, గతంలో ఉచిత శిక్షణ పొందని వారికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలు రాసేందుకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా తెలిపారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు [illegible] అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వడపోత పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. గిరిజన నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పనిదినాల్లో 8374417424, 9441003400 నెంబర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని పేర్కొన్నారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులతో ఉపాధి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఐటీఐల ద్వారా అందిస్తున్న సత్వర ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏటూరునాగారం ఆర్‌ఐటీఐ ప్రిన్సిపల్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వరంగల్ ఉపాధి, శిక్షణ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకుడు సీతారాములు విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల ప్రాధాన్యంపై వివరించారు. ఈ కార్యక్రమానికి వాజేడు ఐటీఐ ప్రిన్సిపల్ శేఖర్, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు పోచం, ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, జేడీఎం కొండలరావు, సీడీపీవో ప్రేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసం.. మన పాలనాధికారులు



–వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

వినూత్న ఆలోచనలతో ముందడుగు

ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో పాలనాధికారులు వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.. ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారు. పాలనలో తమదైన ప్రత్యేక ముద్ర వేస్తూ కీలకమైన విద్య, వైద్య రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ములుగు, జనగామ, వరంగల్ పాలనాధికారులు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.



దుగ్గొండి బాలుర వసతిగృహంలో ఫిర్యాదుల పెట్టెను తెరుస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఉన్నతిలో 'కీ'రోల్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాల్లోని విద్యార్థుల ఉన్నతిపై **వరంగల్ పాలనాధికారి డా.సత్యశారద** దృష్టి సారించారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వసతిగృహాలు, గురుకులాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేశారు. వాటి తాళాలు ఆమె వద్దే ఉంటాయి. విద్యార్థులు తమ సమస్యలను చీటీల్లో రాసి పెట్టెలో వేస్తున్నారు. ఎవరు ఫిర్యాదు చేశారో వార్డెన్, ఇతర సిబ్బందికి తెలియనీయకుండా.. విద్యార్థుల డార్మెంటరీలలోనే వాటిని ఏర్పాటుచేశారు. ఆకస్మిక తనిఖీల సమయంలో పాలనాధికారి పెట్టెలను తెరిచి సమస్యలు తెలుసుకుంటున్నారు. పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. దాంతో వసతిగృహాలు, గురుకులాల సిబ్బంది విద్యార్థులకు అందించే భోజనాలు, శుభ్రతపై అప్రమత్తంగా ఉంటున్నారు. ● ఫిర్యాదుల పెట్టె ద్వారా విద్యార్థులు కోరినట్లు నవంబరు 15 లోగా దుప్పట్లు పంపిణీ చేస్తామని పాలనాధికారి తెలిపారు.



ఆసుపత్రిలో రిజిస్టర్ పరిశీలిస్తూ..



ప్రతి సమస్య నమోదుకు ప్రత్యేక పుస్తకం

హనుమకొండ పాలనాధికారి ప్రావిణ్య వినూత్నంగా ఆలోచించి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) బుక్ ఏర్పాటు చేశారు. ఎవరైనా కలెక్టర్‌కు నేరుగా దరఖాస్తు ఇచ్చినా, తాను క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సమస్యలేమిటో ఆరా తీస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు ఏం చేయాలి.. తన పరిధిలో చేయొచ్చా.. పై అధికారులతో మాట్లాడాల్సి వస్తుందా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా.. ఇలా ప్రతి పనికి సంబంధించి పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లో ఏటీఆర్ బుక్‌లో నమోదు చేసి ఆన్ లైన్ చేయిస్తున్నారు. ప్రతి శనివారం సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. ఫలితంగా ఆయా పనులు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. ● ఏటీఆర్‌లో నమోదైన సమస్యలపై సమీక్షిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాని పాలనాధికారి ప్రావిణ్య పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

వాట్సప్ హాజరు గ్రూపులతో గైర్హాజరుకు ముకుతాడు



ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని **జనగామ పాలనాధికారి రిజ్వాన్ బాషా** ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ఆయన తనతో పాటు డీఎంహెచ్ఓ, ఇతర వైద్యాధికారులు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, అన్ని విభాగాల సిబ్బందితో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సీహెచ్‌సీల్లో ప్రతి రోజూ విధులకు హాజరయ్యే వైద్య, సిబ్బంది విధుల్లోకి వచ్చిన, వెళ్తున్న సమయంలో ఆ గ్రూప్‌లో ఫొటో పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు. ఆ రోజు ఎంత మందికి ఓపీ చూశారు, ఎంత మంది ఇన్‌పేషెంట్లకు వైద్యం చేశారనే వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గ్రూప్‌ను డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ పర్యవేక్షిస్తుంటారు. పాలనాధికారి కూడా ప్రతి రోజూ పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తూ తన అభిప్రాయాలను పోస్టు చేస్తున్నారు. పాలనాధికారే గ్రూప్‌లో ఉంటూ గమనిస్తుండటంతో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య, సిబ్బంది మెరుగైన హాజరు కనిపిస్తోంది.

పాఠశాలల్లో సైతం: జులైలో 600 మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టారని తెలుసుకున్న పాలనాధికారి విద్యాశాఖలోనూ ప్రక్షాళన ప్రారంభించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయించారు. రోజూ హాజరు శాతం పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు.

● రాష్ట్రంలో జనగామను ఆదర్శ జిల్లాగా ముందు వరుసలో ఉంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పాలనాధికారి రిజ్వాన్ బాషా తెలిపారు.

–న్యూస్‌టుడే, జనగామ టౌన్



విధుల్లో ఉన్నామంటూ వాట్సప్ గ్రూపులో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

కంటెయినర్ ఆసుపత్రితో చేరువైన వైద్యం, విద్య



ములుగు జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ప్రజలు సరైన రహదారి లేక అవస్థలు పడుతుంటారు. వర్షాకాలం విద్య, వైద్యం అందని పరిస్థితులు. **ములుగు పాలనాధికారిగా టీఎస్ దివాకర** జూన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంత్రి సీతక్క ఇక్కడి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని ఆయన్ను కోరారు. ఆయన జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి కంటెయినర్ ఆసుపత్రి ఆలోచనను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనలతో తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో కంటెయినర్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్(కంటెయినర్ ఆసుపత్రి) ఏర్పాటు చేయించారు. నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాలకు కూడా దీని ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. వాజేడు మండలం ఎడ్జర్లపల్లిలోనూ ఏర్పాటు చేయించారు. రూ.7 లక్షలు వెచ్చించి తయారు చేయించారు. ఇందులో నాలుగు పడకలు ఉంటాయి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంటు వైద్య సేవలందిస్తున్నారు.

ఇదే స్ఫూర్తితో పాఠశాల..: కన్నాయిగూడెం మండలం బంగారుపల్లి గొత్తికోయ గూడెంలో రూ.13 లక్షలతో పాఠశాల కోసం కంటెయినర్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్తు, డ్యూయెల్ డెస్కులు, ఫ్యాన్లు, నల్లబోర్డు, తదితర వసతులున్నాయి.

● రవాణా సౌకర్యం లేని గ్రామాల్లో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని పాలనాధికారి దివాకర తెలిపారు.

–ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి



కంటెయినర్ బడిలో చదువుకుంటున్న విద్యార్థులు

అనుమానితులపై అప్రమత్తత అవసరం



చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లను అందజేస్తున్న డీఎస్పీ రవీందర్, ఎస్సై వెంకటేశ్వరరావు

ములుగు రూరల్, న్యూస్‌టుడే: ఎవరైనా అనుమానితులు, కొత్తవ్యక్తులు గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. ములుగు మండలం జగ్గన్నగూడెం గ్రామ పరిధిలోని బోడ రామయ్యగడ్డ గొత్తిగోయ గుంపును శుక్రవారం ఎస్సై వెంకటేశ్వరరావుతో కలిసి సందర్శించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా గొత్తికోయ గ్రామాన్ని సందర్శించి వారికి పలు సూచనలు చేశారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టనబెట్టుకుంటున్న విప్లవ పార్టీలతో నష్టం తప్ప లాభం లేదన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. గుడుంబా తయారీకి సంబంధించిన సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సివిల్, ప్రత్యేక బలగాలు పాల్గొన్నాయి.

శిక్షణ తరగతులు.. బృంద చర్చలు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: కాకతీయ కళాక్షేత్రమైన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. యునెస్కో సూచనల మేరకు ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరంలో నాలుగో రోజైన శుక్రవారం ఉదయం యోగాసనాలతో ప్రారంభమైంది. నాగార్జున యూనివర్సిటీ టూరిజం ప్రొఫెసర్ గోవిందరాజు వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత, వాటితో ముడిపడిన భవిష్యత్తుపై వివరించారు. పూర్వ భారతీయ చారిత్రక పరిశోధన మండలి అధ్యక్షుడు, ప్రొఫెసర్ వై.సుదర్శన్‌రావు కాకతీయ హెరిటేజ్ గురించి, వాలంటీర్ల బాధ్యతపై తరగతులు నిర్వహించారు. రెండు రకాల తరగతుల అనంతరం అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్ వాలంటీర్లతో సామూహిక చర్చలు(గ్రూప్ డిస్కస్) నిర్వహించి వారు నేర్చుకున్న అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో కాకతీయ హెరిటేజ్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పురావస్తు, టూరిజం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గోవిందరాజు



చర్చల్లో పాల్గొన్న వాలంటీర్లు

మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచాలి



దస్త్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్, చిత్రంలో సీఐ కుమార్, ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం, న్యూస్‌టుడే: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా పోలీసు అధికారి డాక్టర్ శబరీష్ ఆదేశించారు. వెంకటాపురం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన వార్షిక పరిశీలనలో భాగంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి కేసుల నమోదు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఠాణాలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కిట్ సామగ్రి, ఆయుధాలపై నైపుణ్యతను నేరుగా పరిశీలించారు. రక్షకభట నిలయం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మావోయిస్టుల కదలికలపై నిఘాను తీవ్రతరం చేయాలన్నారు. అదే క్రమంలో ప్రజలకు భద్రతతో కూడిన భరోసా ఇచ్చేలా ప్రణాళికలు ఉండాలని, అంతరాష్ట్ర సరిహద్దున ఉన్న ఈ ప్రాంతంలోకి గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించాలని సూచించారు. గుడుంబా అమ్మకాలు, అక్రమ రవాణా, తయారీపై కొరడా ఝుళిపించి అరికట్టాలని ఆదేశించారు. రవాణాకు ఆటంకం కలిగించేలా రహదారులపై నిలిపే ఇసుక లారీ యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, వారికి కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. ఫిర్యాదుల చేసిన వారికి రసీదును అందజేయాలన్నారు. పోలీస్ ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నదని, విధి నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, శిక్షణ ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

రామప్ప.. సకల కళల సమ్మేళనం..!

వివరాలు 16లో

అన్నివర్గాలకు లబ్ధి చేకూర్చడమే భాజపా లక్ష్యం



పాలంపేటలో సభ్యత్వ నమోదులో భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, సభ్యత్వ నమోదు ప్రముఖ్ భూక్య జవహర్‌లాల్, శ్రేణులు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చడమే భాజపా లక్ష్యమని, పేదల కోసం కేంద్రంలోని భాజపా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, సభ్యత్వ నమోదు ప్రముఖ్ భూక్య జవహర్‌లాల్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన జిల్లాగా ములుగు నిలవాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రచారి, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణారావు, నాయకులు రమేష్, నాగేశ్వరరావు, సుధీర్, ప్రభు, శరత్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు పట్టణంలో..

ములుగు: ములుగులోని గాంధీ విగ్రహం వద్ద భాజపా ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ లవన్ కుమార్, నాయకులు విశ్వనాథ్, రాజ్‌కుమార్, రాకేష్ యాదవ్, రాకేష్‌రెడ్డి, స్వరూప, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గత నెలలో కురిసిన భారీ వర్షానికి మేడారం గ్రామ శివారులో నీట మునిగిన పొలాలు



తాడ్వాయి మండలం ఇందిరానగర్‌లో వరి పొలంలో ఇసుకమేటలు

అబ్బే.. అంత నష్టం లేదట!

న్యూస్‌టుడే, ములుగు

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. ప్రధానంగా వరి పంట ఎక్కువగా దెబ్బతినగా, మిగిలిన పంటలకు కొంతమేర నష్టం జరిగింది. అయితే ప్రభుత్వ లెక్కలు మాత్రం నష్టం స్వల్పమే అని తెలుస్తున్నాయి. గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో వరి కొట్టుకుపోవడం, ఇసుక మేటలు వేయడం, పొలాలు కోతకు గురయినా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల కారణంగా నష్టం అంచనా గణనీయంగా తగ్గించడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో వరి పంట నష్టాన్ని సుమారు 1,600 ఎకరాల నుంచి 113 ఎకరాలకు కుదించారు. వర్షాలు కురిసిన కొద్ది రోజుల్లోనే ప్రాథమిక సర్వే నిర్వహించారు. గోవిందరావుపేట మండల పరిధిలో 244 హెక్టార్లు, తాడ్వాయి మండలంలో 360 హెక్టార్లు, ఏటూరునాగారం మండలంలో 11 హెక్టార్ల మేర వరికి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం 33 శాతం పైన నష్టపోయిన పంట పొలాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని గోవిందరావుపేట మండలంలో 150 ఎకరాలు, తాడ్వాయి మండలంలో 150 ఎకరాల్లో నష్టం జరిగినట్లు నిర్ధారించారు. 1,600 ఎకరాల నష్టం కాస్తా 300 ఎకరాలకు చేరింది. ఇది కూడా పరిగణనలోకి తీసుకోకుండా తుది సర్వే నిర్వహించి చివరికి 113 ఎకరాలకు నష్టం జరిగినట్లు నిర్ధారించారు.

రూ.11.30 లక్షలు మంజూరు

గత నెలలో జిల్లా వ్యాప్తంగా కురిసిన అధిక వర్షాలకు గోవిందరావుపేట మండలంలోని 113 ఎకరాల్లో నష్టం జరిగినట్లు నిర్ధారించి మొత్తం 147 మంది రైతులకు పంట నష్టం ఇచ్చేందుకు అధికారికంగా అంచనాకు వచ్చారు. జిల్లా వ్యవసాయ శాఖ సూచించిన రైతుల జాబితా ప్రకారం 113 ఎకరాలకు రూ.11.30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.


తుది సర్వే నివేదిక ఆధారంగా..

- సురేష్, జిల్లా వ్యవసాయాధికారి

గతనెలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్ట పరిహారానికి సంబంధించి ప్రభుత్వం రూ.11.30 లక్షలు మంజూరు చేసింది. తుది సర్వే నివేదిక ఆధారంగా గోవిందరావుపేట మండలంలోనే ఎక్కువగా నష్టం జరిగింది. మొత్తం 147 మంది రైతులకు సంబంధించి 113 ఎకరాల్లో పంట కోల్పోయినట్లు నిర్ధారించాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతం పైన నష్టం జరిగిన పంటలను మాత్రమే పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశాం.

రామప్ప.. సకల కళల సమ్మేళనం..!

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణలో కొత్త ఆలోచనలకు స్వాగతం



మనకు గర్వకారణం.. రామప్ప ఆలయం.. 800 ఏళ్ల చరిత్ర. ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని యునెస్కో గుర్తింపు పొంది ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధిలోని ఈ రాతి కట్టడం నిర్మాణశైలి నేటి తరానికి ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తోంది. అయోధ్య రామమందిర పునాదిలో రామప్ప సాండ్‌బాక్సు టెక్నాలజీ వాడారంటే ఆనాటి సాంకేతిక పరిజ్ఞానం ఎంత గొప్పదో తెలుస్తోంది..

యునెస్కో గుర్తింపు పొందిన కట్టడాల ప్రాముఖ్యాన్ని ప్రపంచస్థాయిలో మరింత ప్రచారం చేయడానికి యునెస్కో.. ఏటా వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు రామప్పలో జరుగుతోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు మే నెలలోనే దరఖాస్తులు స్వీకరించింది. 243 మంది దరఖాస్తు చేసుకోగా.. 40 మందిని ఎంపిక చేసింది. వీరితో పాటు యువ టూరిజం పేరుతో ఈ శిబిరానికి మరో 40 మందికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అవకాశం కల్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాలంటీర్లతో మాట్లాడి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–వెంకటాపూర్, న్యూస్‌టుడే

'కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన టూరిజం, చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్, కళలు, సివిల్ ఇంజినీరు విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు వాలంటీర్లుగా శిక్షణ పొందుతున్నారు.'



శిక్షణ బృందం

కేరళ..

సామాజిక మాధ్యమాల్లో తెలుసుకుని..



కేరళ యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న సంజయ్ మూడేళ్ల నుంచి కాలభైరవునిపై పరిశోధన చేస్తున్నారు. భారత దేశంలో ఉన్న ఆలయాలను స్వయంగా వెళ్లి చూడటం.. వాటి ప్రత్యేకతలు తెలుసుకోవడం ఆయనకు అభిలాష. సంజయ్ సందర్శించిన ఆలయాలు చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నవి కూడా ఉన్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉండి, ఆనాడే అద్భుత సాంకేతికతను వాడడం, తెలుగు రాష్ట్రాల నుంచి యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప అని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్నారు. వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణకు దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యారు.

● రామప్పకు చేరుకోగానే శిలాశాసనం, చరిత్ర గురించి ఆరా తీశారు. ఆయన పరిశీలించిన ఆలయాల్లో రామప్పకు గొప్ప ప్రత్యేకత ఉందని, వాడిన సాంకేతిక పరిజ్ఞానం మరెన్నో కట్టడాల పునర్నిర్మాణానికి ఉపయోగకరంగా ఉందని ఇతరులకు తెలియజేయడానికి నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా చర్చిస్తున్నారు.

తమిళనాడు

సదస్సులకు వెళ్తూ.. స్వయంగా పరిశీలిస్తూ



టీఎన్ఎస్ డీఏ పీజీ డిప్లొమాలో ఇంజినీరింగ్ చేస్తున్న విజయరాజ్‌ది తమిళనాడు. దేశవ్యాప్తంగా వారసత్వ కట్టడాలకు సంబంధించిన సదస్సులకు హాజరవ్వడం మక్కువ. ఫేస్‌బుక్‌లో చూసిన పోస్టును ఆధారం చేస్తుకుని వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు సూచనల మేరకు తమిళనాడు నుంచి తన నలుగురు మిత్రులతో కలిసి రామప్పకు వచ్చారు.

● కాకతీయులు నిర్మించిన ఆలయాల ప్రత్యేకత గురించి శిబిరంలో నేర్చుకుంటున్నారు. ప్రొఫెసర్లు వివరించే తీరు, ప్రత్యక్షంగా చూపించే పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉందంటూ చెప్పారు. శిక్షణలో కొత్త ఆలోచనలు పంచుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్

ప్రకృతి ప్రతిరూపమే.. పర్యాటకం



ప్రకృతి రూపమైన పర్యాటకాన్ని ప్రపంచ నలుమూలలా చాటేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన జ్ఞానకళ బీబీఏ టూరిజం విభాగంలో పరిశోధనలు చేస్తున్నారు. లెజర్ టూరిజం, అడ్వెంచర్, పుడ్స్, గుళ్లుగోపురాలకు సంబంధించిన పర్యాటక మెలకువలను నేర్చుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● పర్యాటక ప్రదేశాలకు వెళ్లిరావడం కాదని, అక్కడ చూసిన, తెలుసుకున్న విషయాలపై అవగాహన పెంచుకొని పలువురికి తెలియజేయాలని వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికలుగా వేలాది మందికి అవగాహన కల్పిస్తున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన బృందాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రామప్ప అద్భుత శిల్పాల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు..

తెలంగాణ

టూరిజం క్లబ్‌లో స్థానం దక్కించుకుని..



చరిత్రను అభ్యసించేవారు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వరంగల్ పింగిళి కళాశాల హిస్టరీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో స్వప్న బీఏ(చరిత్ర) చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టూరిజం క్లబ్(యువటూరిజం)లో స్థానం దక్కించుకుని వాలంటీర్ శిక్షణకు ఎంపికయ్యారు.

● కాకతీయ కట్టడాల చరిత్ర అంటే అంతా ఒకేలా ఉంటుందని అనుకున్న ఆమె రామప్పకు చేరుకున్న తర్వాత ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, పొన్న చెట్టుపై ఉన్న శ్రీకృష్ణుడు సత్యభామ చీర లాగడం, శిల్పాలను మీటితే సరిగమపదనిసలు రావడం, క్షీరసాగరమథనం, శివపార్వతుల కళ్యాణం, నరకాసురవధ లాంటి పురాణ హితిహాసగాథలు, భూకంపాలను తట్టుకునే విధంగా కట్టిన ఆలయ నిర్మాణాన్ని చూసి అబ్బురపడిపోయారు. దేశంలోని చరిత్రలకే కాకతీయుల చరిత్ర పునాదిగా నిలిచిందంటున్నారు.



హనుమకొండ జిల్లాలోని ఓ క్వారీలో తవ్వకాలు

ఇక్కడా ఉన్నారు ఘనులు

● కరుగుతున్న గుట్టలు.. తరలుతున్న మొరం

గనుల మేతలో ఆరితేరిన లీజుదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. జనగామ జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ ఇటీవల సస్పెండ్ అయ్యారు.. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసినప్పుడు స్థిరాస్తి వ్యాపారులకు సహకరించి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరిపి ప్రభుత్వం ఆమేరకు నిర్ణయం తీసుకుంది.. ఉమ్మడి జిల్లాలోనూ గ్రానైట్, మట్టి తవ్వకాల్లో రూ.కోట్లల్లో అక్రమాలు జరిగింది. ఇక్కడ సైతం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అవినీతి అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

–ఐనవోలు (హనుమకొండ), న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా గనుల తవ్వకాల కోసం అనుమతులు పొందినవి 1,276 కాగా, అక్రమంగా తవ్వకాలు చేపట్టేవి 430కి పైగా ఉన్నట్లు గుర్తించారు.'

'వరంగల్ గ్రానైట్‌ను దేశంలో అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. క్వారీల నుంచి బ్లాక్, టాన్ బ్రౌన్, టాన్ రెడ్, టాన్ బ్లూ గ్రానైట్ అధికంగా లభిస్తుంది.'



ప్రభుత్వ ఆదేశాలతో విచారణ జరిపిన అధికారులు గనుల తవ్వకాల్లో భారీగా సీనరేజి ఎగవేత జరిగిందని గుర్తించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో లీజుదారులకు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 80 మందికిపైగా లీజుదారులకు నోటీసులు అందజేసి జరిమానా విధించారు. దీంతో కొంతమంది క్వారీలు మూసివేశారు.

పంట పొలాలు.. వెంచర్లుగా: స్థిరాస్తి వ్యాపారం సజావుగా కొనసాగాలంటే అనుమతులతో పాటు భూమి చదునుగా ఉండటం ముఖ్యం. ఇందుకు ప్రధానంగా మొరం అత్యంత అవసరం. గ్రేటర్ వరంగల్ నగరం చుట్టూ ధర్మసాగర్, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, హసన్‌పర్తి మండలాల్లో 109 గ్రానైట్, మొరం క్వారీలు ఉన్నాయి. ఇందులోని మొరాన్ని స్థిరాస్తి వ్యాపారానికి వినియోగిస్తున్నారు. అధికారులు ఇచ్చే అరకొర అనుమతులతో గ్రానైట్, మట్టి, ఇసుక తవ్వకాల్లో అనుమతులకు భిన్నంగా లీజుదారులు తోడేస్తున్నారు. నగరానికి వేలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు, లీజుదారులు, వ్యాపారులు కుమ్మక్కై చేతివాటం చూపడంతో వేలాది వ్యవసాయ భూములు వెంచర్లుగా వెలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● కాజీపేట నుంచి వరంగల్ వెళ్లే బైపాస్ ప్రధాన మార్గం భట్టుపల్లి రెవెన్యూ పరిధిలో రహదారికి ఆనుకొని ఉన్న 18 ఎకరాల భూమి రోడ్డుకు 10 ఫీట్ల లోతులో ఉండేది. ఆ భూమికి ఎదురుగా ఓ కార్పొరేట్ పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయగా ఆ ప్రాంత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. లోతట్టులో ఉన్న భూమిని రహదారికి సమాంతరంగా చేయాలని ఆ భూమి యజమాని భావించారు. గత పాలకులు, అధికారుల సహకారంతో కొండపర్తి, వనమాలకనపర్తి, తరాలపల్లి క్వారీల నుంచి 4 వేలకుపైగా టిప్పర్ల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల మొరం తరలించి రోడ్డుకు సమాంతరంగా భూమిని చదును చేశారు.

● హైదరాబాద్ -వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో రాంపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతులు తీసుకుని 30 ఎకరాల్లో ఏర్పాటు చేసి ఓ లేఅవుట్, వరంగల్-ఖమ్మం జాతీయ ప్రధాన రహదారిలో పున్నేలు రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్, దేవన్నపేట, మడిపల్లి రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ల భూముల్లోకి వేలాది టిప్పర్ల ద్వారా మొరం తరలించారు. మొత్తంగా రూ.8 కోట్లకు పైగా మొరం తరలింపులో అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ధర్మసాగర్ మీదుగానే గూడ్స్ లైన్ బైపాస్

● నష్కల్ నుంచి చింతలపల్లికి మరోటి

కాజీపేట, న్యూస్‌టుడే: హసన్‌పర్తి రోడ్డు నుంచి ధర్మసాగర్ మీదుగా నష్కల్ వరకు గూడ్సు బైపాస్ లైను నిర్మాణానికి రైల్వే శాఖ అడుగులు వేస్తోంది. తాజాగా ఈ మార్గంలో 24.55 కి.మీటర్ల మేర భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ధర్మసాగర్ రైతులు బైపాస్ లైను మార్గం మార్చాలని కోరుతున్నారు. ముందుగా పెండ్యాల నుంచి 163వ జాతీయ రహదారి పక్కనుంచి లైన్‌ను ప్రతిపాదించారు. తర్వాత బైపాస్ మార్గాన్ని మార్చుతూ రైల్వే నిర్ణయం తీసుకుంది. కొందరు పెద్దల ఒత్తిడే దీనికి కారణమంటూ ధర్మసాగర్ రైతులు ఆరోపిస్తున్నా.. రైల్వే శాఖ ధర్మసాగర్ మీదుగానే బైపాస్ నిర్మాణానికి సిద్ధమైంది. భూసేకరణ కోసం జనగామ, హనుమకొండ జిల్లాల్లోని ధర్మసాగర్, హసన్‌పర్తి, చిల్పూర్ రెవెన్యూ అధికారులకు నోటిఫికేషన్ అందించింది. దీంతో పాటు నష్కల్ నుంచి మామునూరు మీదుగా గీసుకొండ మండలం చింతల్ రైల్వే స్టేషన్ వరకు మరో బైపాస్‌ను ప్రతిపాదించింది. గూడ్సురైళ్లను బైపాస్‌ల మీదుగా పంపించి కాజీపేట, వరంగల్ స్టేషన్లలో ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు సుగమం చేయడానికి ఈ రెండు మార్గాలను ప్రతిపాదించింది. బల్లార్షా- కాజీపేట మార్గంలో గూడ్సు రైళ్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండటం వల్ల ఈ మార్గంలో ముందస్తుగా నిర్మాణం చేయాలని భావిస్తోంది.

వంతెన నిర్మాణానికి ప్రణాళిక.. : హసన్‌పర్తి రోడ్డు - నష్కల్ స్టేషన్ల మధ్య నిర్మించే బైపాస్ లైన్ నష్కల్ లేదా పెండ్యాల వద్ద 163వ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ వల్ల ఎక్కువగా ధర్మసాగర్ గ్రామస్థులు, రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అందుకని ఈ రెండు చోట్ల వంతెనల నిర్మాణం కోసం రైల్వే అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



రైల్వే శాఖ విడుదల చేసిన రూట్‌మ్యాప్

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల వధూవరులకు 'ఈనాడు' పెళ్లిపందిరి. నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



జనగామ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనగామలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు, సంబంధిత కుటుంబీకులు నేడు అనగా శనివారం(19 అక్టోబరు 2024) మరియు ఆదివారం (20 అక్టోబరు 2024) నాడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సప్ ఫోన్ నెంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 8314445190, 8008002165 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.



సమస్యలు బోలెడు..

కొత్త వీసీపై ఆశలు

కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులైన విశ్రాంత ఆచార్యులు కర్నాటి ప్రతాప్‌రెడ్డికి ఇక్కడి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు, అధ్యాపకులు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.


విద్యానగర్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే

వేతనాలకే చాలని నిధులు..

ఉత్తర తెలంగాణలో విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పని చేస్తున్న వెయ్యి మంది బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ కింద వస్తున్న రూ.97 కోట్లు వేతనాలకు సరిపోక.. ఏటా రూ.53 కోట్ల నిధులు అంతర్గత సమీకరణల ద్వారా సమకూర్చుకుంటున్నారు. నిధులు లేక అభివృద్ధి అటకెక్కింది. తక్షణం నిధుల సేకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనలను ప్రగతి పథంలో పరుగులు పెట్టించాలంటే అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం. వర్సిటీలో ప్రస్తుతం బోధన అంతా ఒప్పంద, తాత్కాలిక అధ్యాపకులతోనే సాగిస్తున్నారు. మొత్తం 405 రెగ్యులర్ అధ్యాపక పోస్టులు ఉండగా.. అందులో 83 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 190 మంది ఒప్పంద, 201 మంది తాత్కాలిక అధ్యాపకులు బోధిస్తున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులతో కలిపి సుమారు వెయ్యి మంది వరకు అధ్యాపకులు ఉండాలి. వారి నియామకాలే పెద్ద సమస్యగా మారింది.



నిధులు లేక నిరుపయోగంగా ఉన్న కె-హబ్

మరిన్ని..

- విశ్వవిద్యాలయంలో మొత్తం 14 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బాలురకు సరిపడా ఉన్నా.. బాలికలకు వసతి కొరత ఉంది.
- కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. మిగతా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం అవసరం.
- పీహెచ్‌డీ ప్రవేశాలపై కొనసాగుతున్న వివాదం

15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి రానున్నారు. ఆయనకు 32 సంవత్సరాలకు పైగా బోధన, 37 సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వ్యక్తిపరంగా 13వ, పదవీ కాలం పరంగా చూస్తే 15వ ఉప కులపతి అవుతున్నారు. గతంలో ఆచార్య జాఫర్ నిజాం, ఆచార్య టి.వాసుదేవ్ రెండుసార్లు వీసీగా పని చేశారు. ఆచార్య టి.రమేశ్ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 21న ముగిశాక ఇప్పుడు రెగ్యులర్ వీసీ నియామకం అయ్యారు.

ఇదీ ప్రస్థానం

● కర్నాటి ప్రతాప్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా యాచారం. 1981లో బీఎస్సీ (హానర్స్) జంతుశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందారు. అదే విశ్వవిద్యాలయం నుంచి 1983లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ నుంచి పీజీ పట్టా తీసుకున్నారు. 1988లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు.. ముఖ్యంగా

● 2016 నుంచి 2018 వరకు జంతుశాస్త్ర విభాగాధిపతిగా, 2018 నుంచి 2020 వరకు విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, 2020 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా సమర్థంగా పనిచేశారు. 2021లో ఉద్యోగ విరమణ చేశారు. తన ఉద్యోగ ప్రస్థానంలో 104 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రచురించారు. 87 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన, ప్రదర్శనలు చేశారు. 10 ప్రాజెక్టులు పూర్తి చేశారు. 7 పుస్తకాలను రచించారు. 25 మందికి పరిశోధన పర్యవేక్షకుడిగా పని చేశారు.

మిరప నారుకు వలల రక్షణ



వెంకటాపురం, న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా ఏపుగా పెరిగిన మిరప నారును రక్షించుకోవడానికి ఓ రైతు వినూత్నంగా ఆలోచించారు. పైకప్పుగా వలను అమర్చి నీడ ఏర్పాటు చేశారు. వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి సమీపంలో ఈ చిత్రాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ములుగు: ములుగులోని 33/11 కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఈనెల 19న కరెంటు సరఫరా ఉండదని డీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ములుగు మండలంలోని కాసిందేవి పేట, అబ్బాపూర్, పందికుంట, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలంలోని వెంకటాపూర్, లక్ష్మీదేవి పేట, గోవిందరావు పేట మండలంలోని పస్రా, తాడ్వాయి మండలంలోని కాటాపురం, మేడారం గ్రామాలకు సరఫరా ఉండదని, గ్రామస్థులు సహకరించాలని కోరారు.

వంటశాల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..!



గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా వంటశాల నిర్మాణపు పనులు చేపట్టారు. అందుకు ఉపాధి హామీ నిధులు కేటాయించారు. గుత్తేదారు పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. సుమారు పనులు నిలిచిపోయి ఏడాది గడిచిపోయింది. మరో వైపు అధునాతన రీతిలో భోజనశాలను నిర్మించారు. వంటలు మాత్రం ఆరుబయట చేయాల్సిన వస్తుందని మధ్యాహ్న భోజన నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల అకాల వర్షాలు కురుస్తుండడంతో వంట చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ టీఈ జ్యోతిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశాడన్నారు. బిల్లులు చెల్లిస్తే మిగిలిన పనులు పూర్తిచేస్తానని చెప్పారని, విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తానన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

ములుగు టౌన్, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. వాటిని వినియోగంలోకి తీసుకొస్తే యువతకు ఉపయోగపడతాయి - **వేణు, ములుగు**

సమాధానం: మరమ్మతులు చేపట్టి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- **రామకృష్ణ, ఎంపీడీవో**

☛ ములుగు పట్టణం బీడీ కార్మికుల కాలనీలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి.
- **మల్లయ్య, కాలనీవాసి**

సమాధానం: గతంలో ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేశాం. సిబ్బందికి మరోసారి సూచిస్తాం.
- **రఘు, పంచాయతీ కార్యదర్శి**

'గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదు'



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జీఎస్పీ (?) రాష్ట్ర నాయకులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పీసా గ్రామసభల ద్వారానే చేపట్టాలని జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం తహసీల్దారు పి.లక్ష్మీరాజయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఏ సంక్షేమ పథకమైనా ఏజెన్సీలో పీసా గ్రామసభలతోనే చేపట్టాలన్నారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆదివాసీలను ఏకం చేస్తామని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం రెండు పడక ఇళ్లను నిర్మించి ఏ ఒక్క ఆదివాసీ కుటుంబానికి ఇచ్చిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే ప్రక్రియను అనుసరిస్తున్నదన్నారు. జీవో నం.3ను సవరించి పీసా చట్టానికి అనుగుణంగా చేపట్టాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి వెంకటకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు పూనెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో గాలికుంటు నివారణ



టీకా వేస్తున్న పశు వైద్యాధికారిణి రజిత

మంగపేట, న్యూస్‌టుడే: గాలి కుంటు వ్యాధి సమూల నిర్మూలనలో భాగంగా మంగపేట మండలంలోని తిమ్మంపేట, అబ్బాయి గూడెంలో పాడిపశువులకు (ఆవులు, గేదెలు) శుక్రవారం గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిణి సీహెచ్.రజిత తెలిపారు. పశువైద్యశాల పరిధిలోని చెరుపల్లి బాలన్నగూడెం, నీలాద్రిపేట, బుచ్చంపేట, నర్సాయిగూడెం గ్రామాల్లో టీకాలు వేయటం జరుగుతుందన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గోపాలమిత్ర వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యం పారిశుద్ధ్య పనులతో ఆరోగ్య రక్ష



గుమ్మడిదొడ్డిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీకాంత్

వాజేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో పంచాయతీ సిబ్బంది చేపట్టిన పారిశుద్ధ్య పనులను శుక్రవారం మండల పరిషత్ అధికారి(ఎంపీవో) శ్రీకాంత్ పరిశీలించారు. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణానికి స్వస్తి పలకాలని, నిత్యం పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కార్యదర్శి అశోక్‌ను ఆదేశించారు. చెరుకూరు పంచాయతీలోని సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసేందుకు చర్యలు చేపట్టాలని కార్యదర్శి శ్రీకాంత్‌కు సూచించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమన్

ములుగు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మేడుదల మమన్ డిమాండు చేశారు. శుక్రవారం ములుగులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి విద్యార్థులకు స్కాలర్‌షిప్ రావడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.75 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా.. బకాయిలు చెల్లించడం లేదన్నారు. తక్షణమే విడుదల చేయాలని కోరారు. నగర కార్యదర్శి బానోతు అఖిల్, శ్రీధర్, పూర్ణ, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



క్రికెట్ విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

కాటారం, న్యూస్‌టుడే : ధన్వాడలో నిర్వహించిన దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక ధన్వాడ ప్రీమియర్ లీగ్(డీపీఎల్)-9 క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన క్రికెట్ తుది పోరులో మహి-333 జట్టు రాణించి ప్రథమ స్థానం, సాన్వి జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్‌లు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. గెలుపోటములు సహజమేనని, క్రీడల్లో రాణిస్తే గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

రామగుండం-మణుగూరు రైల్వే లైన్ పనుల్లో కదలిక

న్యూస్‌టుడే, భూపాలపల్లి

కోల్‌బెల్ట్ ప్రాంతాలను కలుపుతూ రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదనల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రామగుండం నుంచి మణుగూరు వరకు రైలు మార్గం నిర్మాణానికి దశాబ్దాలుగా కేంద్రం ప్రతిపాదనలు చేసింది. సర్వేలు, భూసార పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. దీంతో పనుల్లో వేగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారులతో కమిటీని నియమించింది. పనుల పర్యవేక్షణతో పాటు నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తూ పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన అధికారులతో కమిటీని నియమించింది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రామగుండం-మణుగూరు రైల్వే లైన్ 207.80 కిలోమీటర్ల మేర ఉంటుంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది. సింగరేణి గనులు విస్తరించి ఉన్న ఈ ప్రాంతాల్లో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు కూడా ఉండటంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని భావించిన రైల్వే శాఖ పట్టాల నిర్మాణాన్ని ప్రతిపాదనల్లో ఎక్కించింది.

ముగ్గురు అధికారులతో కమిటీ

రెండు జిల్లాల పరిధిలో ముగ్గురు అధికారులతో కమిటీని నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్‌తో పాటు భూపాలపల్లి జిల్లా సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కమిటీలో ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, మంథని, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో జరిగే పనులను జిల్లా అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారు. మల్హర్‌రావు, కాపురం, మణుగూరు ప్రాంతాలకు భూపాలపల్లి సబ్‌కలెక్టర్, ఘన్‌పూర్, భూపాలపల్లి మండలాలకు భూపాలపల్లి ఆర్డీవోలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.



రైలు మార్గం రేఖా చిత్రం

భూసేకరణ ప్రక్రియకు చర్యలు

పనుల్లో వేగానికి..

రామగుండం-మణుగూరు రైల్వే పనుల సర్వేలు ఎప్పుడో పూర్తి కాగా.. నాలుగు జిల్లాల కలెక్టర్లకు నివేదికలు అప్పగించారు. రైలు మార్గానికి ఎంత భూమి సేకరించాలి, పరిహారం అంశాలపై అధికారులు కమిటీ యజమానులతో మాట్లాడి చర్యలు చేపట్టనున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం ప్రాంతం మీదుగా ఈ రైలు మార్గం వెళ్తుంది. దీంతో మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. సాధ్యమైనంత తొందరగా భూసేకరణ పనులు పూర్తి చేసేందుకు ఈ కమిటీని నియమించింది. భూసేకరణ ముగిసిన వెంటనే నిర్మాణం పనులు వేగంగా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

అదనపు కలెక్టర్‌కు అభినందనలు



మొక్కను బహూకరిస్తున్న జిల్లా రైసు మిల్లుల అసోసియేషన్ సభ్యులు

ములుగు, న్యూస్‌టుడే: నూతనంగా ఎన్నికైన జిల్లా రైసుమిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీని, జిల్లా పౌరసరఫరాల డీఎం రాంపతిలను మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి మొక్కను బహూకరించారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌ను, నూతన కమిటీని డీఎం రాంపతి శాలువా కప్పి సన్మానించి అభినందించారు. గౌరవ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహోదర్‌రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, అక్కల రఘోత్తం, సంయుక్త కార్యదర్శి డేగల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కోతుల నివారణకు ఉపాయం



వానరాలను బంధించేందుకు తయారు చేసిన బోను

తాడ్వాయి(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: అడవిలో ఉండాల్సిన వానర సైన్యం గ్రామాల్లోకి చేరి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇటీవలి కాలంలో ఏ గ్రామంలో చూసిన కోతుల సంఖ్య విపరీతంగా కనిపిస్తోంది. అవి ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో పెంచుకుంటున్న కూరగాయలు, పండ్ల చెట్లను నాశనం చేస్తున్నాయి. దీంతో చెట్లను తొలగించాల్సిన పరిస్థితులేర్పడుతున్నాయి. సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లి ధ్వంసం చేస్తున్నాయి. కొంత మంది రైతులు వానరాల బెడదతో మొక్కజొన్న, వేరుశనగ, కంది, తదితర పంటలను వేయడం మానేశారు. కోతుల నుంచి విముక్తి పొందేందుకు తాడ్వాయి మండలం కాటాపురం గ్రామ ప్రజలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామానికి చెందిన అభ్యుదయ రైతులు, చిరు వ్యాపారులు రూ.25 వేలు వెచ్చించి కోతులను బంధించే బోనును తయారు చేయించారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ బోనులో చేరిన కోతులను సమీప అడవుల్లోకి తీసుకెళ్లి వదిలేస్తున్నామని రైతులు, చిరు వ్యాపారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దీంతో కోతుల సమస్య పూర్తిగా తగ్గకపోయినప్పటికీ.. కొంతమేర ఉపశమనం లభిస్తోందంటున్నారు.

వీధికో నెంబరు పడమటితండా ప్రత్యేకత



సాధారణంగా పట్టణాలు, నగరాల్లోని కాలనీలు, వీధులకు నెంబర్లు, ఇంటి నెంబర్లతో కూడిన ఫలకాలుంటాయి. కానీ జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పడమటితండాలో ఉన్న పది వీధులకు సంఖ్యను చూపుతూ సిమెంటు ఫలకాలు అమర్చారు. ఇక్కడ సుమారు 400 ఇళ్లు, రెండున్నర వేల జనాభా ఉన్నారని పంచాయతీ కార్యదర్శి అశ్విని తెలిపారు. గతంలో లంబాగాడ్‌నాయక్ అనే వ్యక్తి తన కుటుంబంతో తమ వ్యవసాయ పొలాల వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకోగా అప్పటి నుంచి తండాగా అవతరించింది. కొన్ని మండల కేంద్రాల్లోనూ లేని ఫలకాలు ఈ తండాలో ఉండటంతో పనిమీద వచ్చిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, దేవరుప్పుల (జనగామ జిల్లా)

క్రచ్ సెంటర్లపై స్పష్టత ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి క్రచ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. క్రచ్ సెంటర్లపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలన్నారు. ములుగు జిల్లాలో 40 క్రచ్ సెంటర్లు ఏర్పాటు చేసి హడావుడిగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. సంఘం సభ్యురాళ్లు సరోజన, సమ్మక్క, జమునారాణి, రమాదేవి, ధనలక్ష్మి, పుష్ప, ఇందిర, రాంబాయి, దీప, లక్ష్మీకాంత తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పులు, వాటి పర్యవసానాలు, విద్యారంగ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించనున్నారు. సమావేశానికి జిల్లా నుంచి విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

యువతి ఆత్మహత్య



శైలజ(పాతచిత్రం)

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: చున్నీతో ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏటూరునాగారం పట్టణంలో చోటుచేసుకుంది. బంధవులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఘణపారపు నాగేశ్వర్‌రావు, శారద దంపతులకు ఇద్దరు కూతుళ్లు. మూడేళ్ల కిందట నాగేశ్వర్‌రావు అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి రజక వృత్తి పని చేస్తూ.. తన ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటోంది. పెద్ద కూతురు శైలజ(23) నిత్యం చురుగ్గా, అందరితో కలివిడిగా ఉండేది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో తల్లి బయటికి వెళ్లడంతో.. ఇంట్లో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనతో స్థానికంగా విచారం నెలకొంది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వెంకటాపూర్, న్యూస్‌టుడే: భూపాలపల్లి మండలం పెద్దాపూర్-జంగుపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న ఇద్దరిలో ఒకరు మృతిచెందారు. భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్-జంగుపల్లి గ్రామాల మధ్య బుధవారం సాయంత్రం లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో జంగుపల్లికి చెందిన పేరాల వెంకటేశ్వరరావు(16) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఇద్దరు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, జంగుపల్లికి చెందిన వేముల మణిదీప్(18) శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



శిబిరంలో సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు రూరల్, న్యూస్‌టుడే: జిల్లాలో శుక్రవారం పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. డ్రైడే ఫ్రైడే చేపట్టి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని వైద్యులు సూచించారు. ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటా జ్వర సర్వే చేపట్టి ఎనిమిది మంది వైద్యులతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య పర్యవేక్షణలో 235 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య గ్రామంలోని పలు వీధులను, పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి తిరుపతికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తూ.. కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. గుంతల్లో నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ తెరలను వినియోగించాలని, జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రేమ్‌సింగ్, రవళి, నవ్యరాణి, దీప్తి, నందకిషోర్, శ్రావణ్, నవ్య, ఏఎంఓ దుర్గారావు, సబ్ యూనిట్ అధికారి సాంబయ్య, సూపర్‌వైజర్ దేవేందర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మరికాలలో వ్యర్థనీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తేనే ఆరోగ్యంగా ఉంటామని మరికాల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి అన్నారు. ఎదిర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఎదిర, తిప్పాపురం, చొక్కాల, మరికాల, వీరభద్రవరం, నూగూరు, రాచపల్లి, ఆలుబాక ప్రాంతాల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పలు నివాసాల్లో దోమల వ్యాప్తికి ఆస్కారంగా ఉన్న వ్యర్థనీటిని పారబోసి సూచనలు చేశారు. అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ శిబిరాల్లో వైద్యులు సోహల్, ఆశీష్, వినయ్, పవన్‌కల్యాణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ వెలికి తీసేందుకే 'కళాఉత్సవ్'



తాడ్వాయి మండల కేంద్రంలో



ములుగులో జిల్లాస్థాయికి ఎంపికైన వారితో ఎంఈవో శ్రీనివాసులు



మంగపేటలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ములుగు, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో శుక్రవారం మండలస్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ములుగులోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన పోటీలను ఎంఈవో సామల శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రభుత్వం ప్రతి ఏటా ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. మండలస్థాయిలో ఆరు రకాల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపినట్లు చెప్పారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లా, రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు. డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ, న్యాయ నిర్ణేతలు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఆరు అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పొదెం మేనక, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తాడ్వాయిలో నృత్యాలు, పాటలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రేగ కేశవరావు, ఉపాధ్యాయులు శంకర్, సమ్మయ్య, జయపాల్, చంద్రారెడ్డి, వసంతరావు, రేణుక, రజిత, వనిత, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులో పోలీసుల ఔదార్యం



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం పట్టణంలోని అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు 163 జాతీయ రహదారిపై గుంతలు, గాడులు పడి అధ్వానంగా మారింది. అదే పనిగా నడుస్తున్న ఇసుక లారీల తాకిడికి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. సమస్యపై స్పందించిన జిల్లా ఎస్పీ శబరీష్ మరమ్మతులు చేయించాలని ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, తాజుద్దీన్‌లను ఆదేశించారు. ఈ మేరకు గుంతలు, గాడుల్లో కంకర పోయించి రోలింగ్ చేయించి ఇబ్బందిని తాత్కాలికంగా దూరం చేశారు. వాహనదారులు పోలీసుల చర్యలను హర్షిస్తున్నారు.